## క్లుప్తంగా

### 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

నెల్లూరురూరల్: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంత్యుత్సవాన్ని ఈ నెల ఐదున నిర్వహించనున్నామని కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేదాయపాళెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పుష్పాలంకారం, తదుపరి కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో జయంత్యుత్సవాన్ని నిర్వహించనున్నామని వెల్లడించారు. జిల్లాలోని అందరూ ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): పాలిసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణను వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నామని చెప్పారు. ప్రవేశ పరీక్షకు ఈ నెల 15లోపు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99123 42016 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఈఓపీఆర్డీ, కార్యదర్శిపై విచారణ నేడు

కోవూరు : కోవూరు ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలపై కోవూరు పాలకవర్గ సభ్యులు కొందరు నెల్లూరు డీపీఓ శ్రీధర్‌రెడ్డికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం కోవూరులో విచారణ చేస్తున్నట్లు డీఎల్‌పీఓ రమణయ్య బుధవారం తెలిపారు. ఈ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు.

### కల్వర్టు నిర్మాణానికి చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లో ఉన్న గుడిపల్లికాలువ కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ గోపీచంద్ తెలిపారు. కల్వర్టు నిర్మాణ ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణానికి రూ.4.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక ప్రజలు ఏఈని కోరారు.

### రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు : మండలంలోని వేగూరు గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో రీసర్వేకు సంబంధించిన అవగాహన ర్యాలీని అధికారుల బృందం బుధవారం సాయంత్రం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగూరు పంచాయతీకి సంబంధించి ఏయే ప్రాంతాల్లో రీసర్వేను ప్రారంభిస్తారో రెండు రోజుల ముందుగానే రైతులకు సమాచారం ఇస్తారన్నారు. రైతులు హాజరై తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో సమాచారం ఇవ్వాలన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ నాజర్, ఎలక్షన్ డీటీ రవి, సర్వేయర్ రమేష్ యాదవ్, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

### నోటి ఆరోగ్యంపై అవగాహన

పొదలకూరు : ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీని నిర్వహించారు. పంటి సంరక్షణకు సంబంధించి పలు సూచనలు జారీ చేశారు. అనంతరం టూత్ పేస్టులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాధా, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించాలి


నారికేళపల్లిలో మూతపడిన ఆర్వో ప్లాంటు

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఆర్వో ప్లాంటు కొద్దిరోజులుగా మూతపడింది. ఇక్కడి రక్షిత తాగునీటి పథకం కూడా వినియోగంలోకి రాలేదు. దీంతో ఈ ప్రాంత పేద కుటుంబాలు తాగునీరును అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఆర్వో ప్లాంటును కృష్ణపట్నం పోర్టు నిర్వాహకులు గతంలో ఏర్పాటు చేశారు. అయితే, గత సంవత్సరం వచ్చిన గాలివానకు ఈ ప్లాంటుపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో ప్లాంటు పరికరాలు చెడిపోయాయి. అయితే, చెడిపోయిన పరికరాలను బాగు చేసినప్పటికీ ప్లాంటు మాత్రం వినియోగంలోకి రాలేదు.

## ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్


హాల్‌టికెట్ నంబర్‌ను చూసుకుంటూ..

ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ మెయిన్స్ పరీక్షను పొట్టేపాళెంలోని అయాన్ డిజిటల్ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం.. ఇలా రెండు విడతల్లో పరీక్షను ఈ నెల తొమ్మిది వరకు నిర్వహించనున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు




ఆల్ ది బెస్ట్ రా కన్నా..

# న్యాయం చేయాలని వినతి

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను మెరిట్ కమ్ రోస్టర్ మేరకు నిర్వహించి రిజర్వ్ కేటగిరీ వారికి న్యాయం చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మణిసుబ్బు, ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఈ విధంగా ఉంటే రిజర్వ్‌డ్ కేటగిరీలో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని చెప్పారు. నేతలు మనోజ్‌కుమార్, లక్ష్మయ్య, మలికార్జునరావు, శ్రీనివాసులు, రాజశేఖర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఏడీకి వినతిపత్రమిస్తున్న బీటీఏ నేతలు

# దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసమే కృష్ణావతారం

నెల్లూరు(బృందావనం): దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసమే కృష్ణావతారమని.. లోక సంక్షేమం కోసమే మహావిష్ణువు దశావతారాలని అవధాని కోట రాజశేఖర్ పేర్కొన్నారు. నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భాగవత సప్తాహంలో దశమ స్కంధంలోని కృష్ణచరిత్రపై బుధవారం ఆయన ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. తొలుత దేవస్థానంలోని మూలవర్లకు పూజలను నిర్వహించారు. ఉభయకర్తలుగా చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, నాగరత్నకుమారి దంపతులు, దువ్వూరు నాగార్జున కుటుంబసభ్యులు వ్యవహరించారు. అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాదా నాగేంద్ర, వేలూరు నారాయణస్వామి, సాదా శ్రీనివాసులు, ఉదయగిరి అనిల్, బ్రాహ్మణ సంఘ మహిళా విభాగాధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, ఉమాదేవి తదితరులు పర్యవేక్షించారు.


కోట రాజశేఖర్‌కు సత్కారం

# చిల్డ్రన్స్ పార్కులో మెరుగైన వసతులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో మరింత మెరుగైన వసతులను కల్పించనున్నామని కమిషనర్ సూర్యతేజ వెల్లడించారు. పార్కును బుధవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడికి విచ్చేసే వారికి అవసరమైన మరుగుదొడ్లు, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా వ్యాయామ పరికరాలు, షటిల్, ఇతర క్రీడా సౌకర్యాలను ప్రత్యేక ప్రాంగణంలో కల్పించేలా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న సూర్యతేజ

# ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా అందజేశామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు వీటిని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి 1,19,724 నోట్, 11,601 పాఠ్య పుస్తకాలను అందజేశామని వెల్లడించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, అధ్యాపకులు చంద్రకళ, వెంకట్రావు, శ్రీదేవి, సమత, విజయలక్ష్మి, పూర్ణచంద్రకుమారి, కృష్ణతులసి, పెంచలనరసయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



# మహాధర్నా విజయవంతానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద ఈ నెల ఏడున నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుమన్, జిల్లా కోశాధికారి పెంచలప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతలు హరినారాయణ, నాగయ్య, ప్రసన్నకుమార్‌రెడ్డి, సురేష్, భాస్కర్, వెంకటేష్, సునీల్, మనోజ్‌కుమార్‌యాదవ్, లోకేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

# కలెక్టరేట్ ఎదుట నిరసన




నెల్లూరు రూరల్: తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట నిరసనను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. 11వ పీఆర్సీ ముగిసి 21 నెలలవుతున్నా, 12వ వేతన సవరణ చట్టాన్ని అమలు చేయకపోవడంతో రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన నెలకొందని చెప్పారు. నూతన వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. 2004 సెప్టెంబర్ ఒకటికి ముందు వచ్చిన నోటిఫికేషన్‌తో నియమితులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని మెమోను కేంద్ర ప్రభుత్వం జారీ చేసినా, రాష్ట్రంలో నేటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్లో అంతర్గత బదిలీలు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాల్లో సూపరింటెండెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న పలువుర్ని అంతర్గతంగా బదిలీ చేస్తూ కమిషనర్ సూర్యతేజ ఉత్తర్వులను మంగళవారం రాత్రి జారీ చేశారు. అదే విధంగా వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే పలువురు కార్యదర్శులను డిప్యుటేషన్‌పై నగరపాలక సంస్థ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ – ఆఫీస్ ఫైల్స్, డాక్యుమెంటేషన్, శాఖల వారీగా నివేదిక తయారీ, ఫిర్యాదులు, పెండింగ్ సమస్యలపై ఫాలోఅప్, రోజువారీ పర్యవేక్షణ నిమిత్తం విభాగాలతో సమన్వయం తదితర బాధ్యతలను వీరు నిర్వర్తించాల్సి ఉంది. బదిలీ అయినవారు తక్షణమే వారికి నియమించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్లో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న కిరణ్, రవికుమార్, వరప్రసాద్‌కు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను కమిషనర్ సూర్యతేజ జారీ చేశారు. ఈ మేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సమావేశ మందిరంలో వీరికి ఉత్తర్వులను బుధవారం అందజేశారు.

### 5న భక్తిగీతాల పోటీలు


మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమి సంబరాల్లో భాగంగా సుబేదారుపేటలో భక్తిగీతాల పోటీలను ఈ నెల ఐదున నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. నర్తకి సెంటర్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. పాల్గొనాలనుకునే వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రఘురామిరెడ్డి, అమానుల్లాఖాన్, సికందర్, మాబాషా పాల్గొన్నారు.

### హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): విశ్వావసు నామ ఉగాది సంవత్సరాదిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరీని పీడీ వేణుగోపాల్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. శాఖ నెల్లూరు, కావలి డివిజన్ల హెడ్లు మోహన్‌రావు, మాధవరావు, జేఏసీ వర్కింగ్ చైర్మన్ మనోజ్‌కుమార్, వెంకటేశ్వర్లురెడ్డి, కృష్ణ, మంజునాథ్, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### క్యాంపస్ డ్రైవ్‌లో 45 మంది ఎంపిక



నెల్లూరు (టౌన్): పార్థసారథినగర్‌లోని జెనెక్స్ విజన్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్‌ను చెన్నైకు చెందిన ఐటీ సంస్థ అల్ట్రాస్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వెంగళ్‌రెడ్డి, డైరెక్టర్ కొండలరావు మాట్లాడారు. ఇందులో 45 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. అనంతరం వారిని అభినందించారు. పీజీ కళాశాల ప్రిన్సిపల్ తేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్, ప్లేస్‌మెంట్ హెడ్ శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# లౌకికవాద భావన పెరగాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజల్లో లౌకికవాద భావన పెరగాలని నెల్లూరు అర్బన్ ఎంఈఓ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచురితమైన రంజాన్ ప్రత్యేక సంచికను మినీబైపాస్‌లోని ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. లౌకికవాదాన్ని పెంపొందించడంలో భాగంగా ప్రత్యేక సంచికలను మూడేళ్లుగా ఆవిష్కరించడాన్ని అభినందించారు. ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్‌చార్జి అరుణ, జిల్లా కమిటీ సభ్యుడు రియాజ్, సర్దార్, అహ్మద్, ఫయాజ్, షబ్బీర్‌బాషా, చాన్‌బాషా, మాలకొండేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రంజాన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

# మర్యాదపూర్వకంగా..

నెల్లూరు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ ఎంప్లాయీస్ – పింఛనర్స్ విభాగాధ్యక్షుడు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, వాణిజ్య విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్, బాబూరావు, మస్తాన్‌రెడ్డి, ఇక్బాల్, మురళీయాదవ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## బహిరంగ ప్రదేశాల్లో ‘పొగాకు’ వినియోగం తగదు

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధించాలని, దీనిపై పోస్టర్లతో ప్రచారం చేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పోస్టర్లను బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, బీడీ తదితరాలను వినియోగించకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలకు వంద డుగుల దూరంలో వీటి విక్రయాలను నిషేధించామని పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాల ద్వారా మాత్రమే వ్యర్థాలను సేకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో వేసే వారిని గుర్తించి జరిమానాలను విధించాలని సూచించారు. ప్రధాన రహదారులను సంపూర్ణంగా శుభ్రపర్చాలన్నారు. వీధి కుక్కలను పట్టుకొని శస్త్రచికిత్స కేంద్రానికి.. ఆవులను గోశాలకు తరలించి సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై తనిఖీలను నిర్వహించి దుకాణదారులకు జరిమానాలను విధించాలని పేర్కొన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంహెచ్ఓ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్ జిజియాబాయి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

# మూతబడిన పబ్లిక్ టాయ్‌లెట్

నెల్లూరు రూరల్: కలెక్టరేట్లో నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న పబ్లిక్ టాయ్‌లెట్ మూతబడింది. ఇక్కడ పనిచేస్తున్న మహిళ, తనకు ఆర్నెల్లుగా జీతమివ్వలేదంటూ దీనికి తాళమేసి బుధవారం వెళ్లిపోయారు. ఫలితంగా ఇది మూతబడింది. దీన్ని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# సలీమ్ కుటుంబానికి పరామర్శ

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సలీమ్ మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

• పార్టీ 17వ డివిజన్ నేత వల్లెపు నాగరాజు అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నివాసానికెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.



# ఎర్ర బ్యాడ్జీలతో నిరసన

నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ జిల్లాలోని అన్ని డిపోల్లో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలను బుధవారం ధరించి నిరసన తెలిపారు. నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో నిరసనను చేపట్టిన అనంతరం ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి మాట్లాడారు. నైట్ అవుట్ అలెవెన్స్‌లను రూ.300కు పెంచాలని డిమాండ్ చేశారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థే కొనుగోలు చేయాలని కోరారు. నిరసన గురువారం సైతం కొనసాగుతుందని చెప్పారు. ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు చెంచయ్య, డిపో అధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున, డీఎమ్కే రెడ్డి, మునీర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆటిజంపై అవగాహన అవసరం



నెల్లూరు(అర్బన్): పిల్లల్లో ఏర్పడే ఆటిజంపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గల ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ఆటిజంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్పాస్టిక్స్ సెంటర్‌లో సెన్సర్ ఇంటిగ్రేషన్, బిహేవియర్, స్పీచ్ థెరపీ లాంటి పలు శిక్షణలను నిర్వహించి పిల్లలను అందరిలా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. సెంటర్ ప్రిన్సిపల్ గుర్నాథరావు తదితరులు పాల్గొన్నారు.